క్లుప్తంగా

ఆలయాలకు రూ.60 వేలు వితరణ



నగదు అందిస్తున్న సుధాకర్

కూసుమంచి: మండలంలోని ముత్యాగూడెం గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు నూతనంగా బంగారు మైసమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ ఆలయాలను నిర్మిస్తుండగా గ్రామానికి చెందిన వైఎస్సార్‌టీపీ నాయకుడు ఊడుగు సుధాకర్ రూ.60వేలు విరాళం అందించారు. ఈ మేరకు మంగళవారం ఆలయ కమిటీల బాధ్యులకు నగదును అందజేశారు.

సత్కారం..

ఖమ్మంమయూరిసెంటర్: ఆంధ్రప్రదేశ్ కాపు సంఘం నాయకులు భారతీయ కాపు ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ నేతృత్వంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ జేఏసీ అధ్యక్షుడు అమ్మా శ్రీనివాస్ నాయుడు, ఉపాధ్యక్షుడు బశెట్టి ప్రసాద్‌రావు, తెలంగాణ జేఏసీ యూత్ అధ్యక్షుడు నాయని వెంకటనాయుడు పాల్గొన్నారు.

20న ఏదులాపురం సొసైటీ చైర్మన్ ఎన్నిక

ఖమ్మంరూరల్: ఏదులాపురం సహకార సంఘం చైర్మన్ ఎన్నిక ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కిషోర్ తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ఉంటుందని తర్వాత ఉపసంహరణ, వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఆధారంగా ఎన్నిక నిర్వహించి వెంటనే ఫలితాలు వెల్లడిస్తారని పేర్కొన్నారు. ఇప్పుడున్న డైరెక్టర్‌లే నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. గతంలో ఉన్న చైర్మన్‌పై ఆరోపణలు రావడంతో ఆయన్ను తొలగించి ప్రస్తుతం ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నియామకం

ఖమ్మం లీగల్: జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి ఖమ్మం కో కన్వీనర్‌గా మద్దెల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మర బోయిన కేశవులు, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి మంగళవారం వెంకటేశ్వర్లుకు నియామకపత్రాన్ని అందజేశారు.

పాలేరులో నీలిజెండా ఎగుర వేయాలి

తిరుమలాయపాలెం: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్న బీఎస్పీ.. పాలేరులో విజయం సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి అల్లిక వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి మండలంలోని రాజారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై బీఎస్పీ ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తుందని చెప్పారు. పాలేరు అసెంబ్లీ అధ్యక్షులు రమేష్, మండల కార్యదర్శి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు కల్పించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ హోంగార్డులు

ఖమ్మంక్రైం: కరోనాకు ముందు, కరోనా తర్వాత మృతి చెందిన హోంగార్డు కుటుంబ సభ్యులకు వెంటనే కారుణ్య నియామకాలు కల్పించాలని కోరుతూ మంగళవారం నగరంలో హోంగార్డులు నిరసన చేపట్టారు. మొదట జెడ్పీ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడ నుంచి ధర్నాచౌక్ వరకు భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హోంగార్డు రిటైర్డ్ ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు సైదులు మాట్లాడుతూ.. ప్రభుత్వం లేనిపోని నిబంధనలతోకారుణ్య నియామకాలు జరపకుండా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో పెడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కారుణ్య నియామకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న హోంగార్డు ఆర్ఐ శ్రీశైలం హోంగార్డు కుటుంబాల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	రామబాణం
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	కేరళ స్టోరీ
సుందర్	కథ వెనుక కథ

- ఖమ్మంవ్యవసాయం

మున్సిపాలిటీ.. 'చెత్త'శుద్ధి!

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం..

- చెత్త సేకరణ జరుగుతున్నా.. రోడ్ల వెంటే వేస్తున్న పలువురు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు



మామిళ్లగూడెంలో రోడ్డు వెంట కుప్పగా పోసిన వ్యర్థాలు



53వ డివిజన్‌లో రోడ్డు వెంట పోసిన చెత్తలో మేకలు ఇలా..



ద్వారకానగర్‌లో డ్రైయినేజీ శుభ్రం చేయకపోవడంతో పేరుకుపోయిన మురుగు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పాలక వర్గం చేపట్టిన పలు కార్యక్రమాలతో నగరంలో ఇటీవల కాలంలో పారిశుద్ధ్యం మెరుగుపడింది. గత మూడు నాలుగేళ్లగా నగరంలో రోడ్ల వెంట చెత్తకుప్పలు కనిపించడం లేదు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమం ప్రారంభించడంతో ప్రజలు రోడ్ల వెంట వ్యర్థాలను వేయడం మానేశారు. దీంతో స్వచ్ఛనగరం దిశగా ఖమ్మం పరుగులు పెట్టింది. అయితే కొన్ని నెలలుగా కేఎంసీలో సిబ్బంది నిర్లక్ష్యంతో మళ్లీ రోడ్ల వెంట చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. అధికారులు పర్యటించి, ఆదేశాలు జారీ చేసినా సిబ్బంది పట్టించుకోకపోవడంతో చెత్త సేకరణ అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో రోడ్ల వెంట చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో పాటు పరిశుభ్రత లోపిస్తుంది.

వ్యర్థాలతో దుర్వాసన..

డివిజన్లలో రోడ్ల వెంట వేస్తున్న చెత్తచెదారాన్ని మున్సిపల్ కార్మికులు రెండు మూడు రోజుల పాటు ఎత్తకపోవడంతో పందులు, కుక్కలు, మేకలు స్వైర విహారం చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఓ పక్క సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తుంటే.. మరో పక్క ప్రజలు కూడా కేఎంసీకి సహకరించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. కొంత కాలంగా రోడ్ల వెంట కనిపించని వ్యర్థాలు తిరిగి మళ్లీ కనిపిస్తుండడంతో పలు విమర్శలకు తావిస్తుంది.

పట్టించుకోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు..

నగరంలో ఒకటి రెండు డివిజన్లు మినహా మిగతా అన్ని డివిజన్లలో రోడ్ల వెంట చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. జవాన్లు నిరంతరం కార్మికుల చేత వ్యర్థాలను ఎత్తించడం, డ్రెయినేజీలను శుభ్రం చేయించడం చేస్తుంటే.. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పారిశుద్ధ్య పనులు పరిశీలించి పలు సూచనలు చేస్తూ ఉండాలి. కానీ డివిజన్లలో జవాన్లు వ్యవహరిస్తున్న తీరుతో కార్మికులు వారి మాట వినే పరిస్థితి లేకుండా పోయిందని తెలుస్తోంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఒక్కొక్కరికి 3,4 డివిజన్ల బాధ్యతలు ఉన్నా.. కనీసం రోజుకు ఒక్క డివిజన్ కూడా తిరిగి పారిశుద్ధ్యం నిర్వహణను చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు జవాన్‌లను గట్టిగా మందలించి పని చేయించుకుందామంటే వారు స్థానిక ప్రజాప్రతినిధులతో పైరవీలు చేయించుకొని.. అధికారులకే చుక్కలు చూపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అలసత్వం వహించొద్దు..



నగరంలో చెత్త సేకరణ విషయంలో సిబ్బంది, కార్మికులు అలసత్వం వహించొద్దు. ఇక నుంచి డివిజన్లలో రోడ్డు వెంట వ్యర్థాలను కనిపిస్తే వెంటనే స్థానిక సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు రోడ్ల వెంట వ్యర్థాలను వేయకుండా చెత్త సేకరణ వాహనాలకు అందించాలి. మరోసారి చెత్త సేకరణపై కార్మికులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– పునుకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

చెత్త సేకరిస్తున్నా..

నగరంలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ కోసం 40 ట్రాక్టర్లు, 40 స్వచ్ఛ ఆటోలను కేఎంసీ తిప్పుతుంది. 60 డివిజన్‌లలో గృహాలతో పాటు వ్యాపార సముదాయాల నుంచి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ చేపట్టేందుకు అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించారు. నగరంలో వ్యర్థాలు వేసేందుకు పాయింట్లు ఉండకూడదనే ఉద్దేశంతో డస్ట్‌బిన్‌లను తొలగించారు. రెండేళ్లుగా ఈ ప్రక్రియ బాగానే కొనసాగినా.. ఇటీవల కాలంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్ల నిర్లక్ష్యంతో ప్రజలు తమ గృహాల నుంచి వెలువడే వ్యర్థాలను రోడ్ల వెంట వేస్తున్నారు. దీంతో చెత్త కుప్పలు రోడ్ల వెంట దర్శనమిస్తూ అపరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి.

రైతులకు నష్టం చేసే రైల్వే లైన్ మాకొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నేలకొండపల్లి: రైతులు, ప్రజలకు నష్టం చేసే డోర్నకల్ టూ మిర్యాలగూడెం రైల్వే లైన్ మాకొద్దని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని గువ్వలగూడెం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు రైతులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారుల ప్రయోజనాల కోసమే ఈ రైల్వే లైన్‌ను ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైల్వే లైన్ పనులను గువ్వలగూడెంలో జరగనీయమని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ వంగూరి వెంకటేశ్వర్లుతో పాటు గువ్వలగూడెం, బోదులబండ రైతులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలు

కూసుమంచి: హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం పాలేరు కంకరమిల్లు సమీపాన ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. పాలేరు, గురువాయిగూడెం, కూసుమంచి గ్రామాలకు చెందిన భక్తులు ఈపూజల్లో పాల్గొనగా వారికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహణ కమిటీ బాధ్యులు సునావత్ నాగేశ్వరరావు, ఎలిశెట్టి ఉపేందర్, సామిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న సీపీఎం ప్రతినిధి బృందం

ఖమ్మంరూరల్: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి. మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఆరెంపుల, బారుగూడెంలలో సీపీఎం ప్రతినిధి బృందంతో కలిసి ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరెంపుల రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడంలేదని తెలిపారు. ఇదే విషయమై గతంలో ఎన్నోసార్లు సంబంధిత అధికారులను కలిసి విన్నవించినా.. పట్టించుకోవడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, ప్రసాద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కూసుమంచి: మండలంలోని మల్లాయిగూడెం గ్రామ పంచాయతీలో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బదావత్ బీబ్లీ, ఉప సర్పంచ్ వీరనాగమ్మ, వార్డు సభ్యులు పద్మ, నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ బదావత్ వీరన్న, రవి, ధూమ్‌సింగ్, సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం..

నేలకొండపల్లి: మండలంలోని ముజ్జుగూడెంలో నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం చైర్మన్ తన్నీరు సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. రైతులు దళారులను ఆశ్రయించకుండా, నాణ్యత ప్రమాణాలు పాటించి కేంద్రంలో మద్దతు ధర పొందాలని తెలిపారు. అలాగే కేంద్రాలకు వచ్చేటప్పుడు పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని ఏఈఓలు ద్వారా టోకెన్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సత్యాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కామేపల్లి(కారేపల్లి): మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటం, కనీసం పక్క మండలాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మొక్కజొన్నలను కొనకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

డిప్లొమా ఫలితాల్లో 'బొమ్మ' విద్యార్థుల ప్రతిభ



శ్రీవల్లి | ఆయేషా ఆశా | నవ్య

ఖమ్మంఅర్బన్: పాలిటెక్నిక్ డిప్లొమా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని బొమ్మ పాలిటెక్నిక్ కాలేజీచైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఆర్.శ్రీవల్లి, ఆయేషా ఆశా, ఎ.నవ్య 9.87 సీజీపీఏ సాధించగా, 9 సీజీపీఏ పైన 60 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్థులను చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: మాలల అభివృద్ధికి ప్రభుత్వం దళిత బంధు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు కల్పించి ఆదుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రమేష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలులో మాల మహానాడు క్యాలెండర్లను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని మాల, మాదిగలందరికీ దళితబంధు ఇవ్వాలని, దళిత బంధు పథకం వలన ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఆగిపోయాయని, వాటిని కూడా పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజలింగం, కృష్ణమూర్తి, భూషణం, పప్పుల ప్రసాద్, నవీన్, పిచ్చయ్య, భద్రమ్మ, ఉపేంద్ర, సుధాకర్, రవీందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నేతల ధర్నా



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్ గౌడ్‌తో కలిసి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పంట అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే అకాల వర్షాలతో పంట నష్టపోయి నందున ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేయాలని, మిల్లులకు తరలించడంలో జాప్యం జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. అంతేకాక తరుగు, తాలు పేరుతో అక్రమాలపై పాల్పడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, భుక్యా చంద్రకళ, డానియల్, శీలం బ్రహ్మారెడ్డి, పుల్లారావు, గోవిందరావు, మలిదు వెంకటేశ్వర్లు, మద్ది వీరారెడ్డి, నగేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల వినతులు

ఖమ్మంమయూరిసెంటర్: తాము ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రేషన్ డీలర్లు మంగళవారం సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, పోటు రంగారావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, టీడీపీ నాయకుడు కూరపాటి వెంకటేశ్వరరావులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల జేఏసీ నాయకులు మాట్లాడగా.. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ప్రతిపక్ష పార్టీ నేతలు హామీ ఇచ్చారు. జేఏసీ నాయకులు మోటమర్రి చంద్రశేఖరరావు, గోళ్ళ మురళి, లగిశెట్టి వెంకటేశ్వర్లు, వై.సుధాకర్, బి.బిచ్చో నాయక్, యు. రాధాకృష్ణ, డి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు టీడబ్ల్యూజేఎఫ్ మహాధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం ఈ నెల 18న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. సర్కారు కనీసం తన విధానాన్ని ప్రకటించలేదన్నారు. గురువారం నిర్వహించే మహా ధర్నాలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాతుపాటి రామయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, సభ్యులు ఎస్.కరుణాకర్‌రెడ్డి, చేబ్రోలు నారాయణ, వీసారపు అంజయ్య, కె.శివారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎస్టీ కమిషన్ సభ్యుడి పూజలు



మెమెంటో అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: ఆదివాసీ, గిరిజన సమస్యలు పరిష్కరించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్‌ను కలిసి మంగళవారం సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజ్‌కుమార్‌జాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని వినతిలో పేర్కొన్నారు. వినతి అందించిన వారిలో రాష్ట్ర నాయకుడు భిక్షపతి రాథోడ్, వీరూనాయక్, రాందాస్‌నాయక్, మంగీలాల్, రాంచందర్, కృష్ణ నాయక్, రాములు, వినోద్, ఉద్యోగ, విద్యార్థి, మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా, నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్‌కాలనీలోని శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అనంత్‌నాయక్ దర్శించుకోగా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. దేవస్థానం చైర్మన్ మేకల వీరన్న, కార్యదర్శి గుగులోత్ మణికంఠ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించొద్దు



శంకుస్థాపన చేస్తున్న మేయర్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: కార్పొరేషన్ పరిధిలోని 49, 50, 58 డివిజన్లలో మంగళవారం సుడా నిధులు రూ.90 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దోరేపల్లి శ్వేత, రాపర్తి శరత్, నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, ఊటుకూరి రవికాంత్, మన్నె వెంకట రమణ, రంగాచారి, నాగేశ్వరరావు, గంట భీమయ్య, గోరంట్ల రవి, రంగారావు, స్వరూప రాణి, కుమార్, శ్రీనివాస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ ఖానాపురం రోడ్డు నుంచి వాగులో పూడికతీత పనులను మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా పూడికతీత పనులను ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, కార్పొరేషన్ ఏఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలి



మాట్లాడుతున్న రామ్మూర్తినాయక్

ఖమ్మంఅర్బన్: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని ఆలిండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ రామ్మూర్తినాయక్, రాష్ట్ర నాయకుడు బానోత్ బక్కీ నాయక్ కోరారు. మంగళవారం నగరంలోని బంజారా భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. గల ప్రభుత్వంలో గిరిజనులకు కల్పించిన విద్య, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌లో నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నాణ్యమైన విద్య అందక వెనుకబడుతున్నారని, దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకులాలు లేదా బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం పాఠశాలలో ప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాక రిజర్వేషన్లు పెంచి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గిరిజనుల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని సమావేశంలో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో మా ఓటు బ్యాంక్‌తో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంత్ సేవాలాల్ నాయకుడు బానోత్ కిషన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బానోత్ తారాబాయి, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ చంద్రం నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి మహిళా నాయకురాలు అజ్మీర సునీతబాయ్, బానోత్ వెంకట్రాంనాయక్, బానోత్ కోటేశ్వరావు, శివాజీ నాయక్, అనిల్ నాయక్, గిరిజన సంఘం నాయకులు బోడ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న తహసీల్దార్

నేలకొండపల్లి: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మట్టి తోలకాలను స్థానిక తహసీల్దార్ అడ్డుకున్నారు. వివరాలిలా.. మండలంలోని చెరువుమాధారంలో గల జెండా గుట్ట నుంచి కొంతమంది అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండడంతో మంగళవారం స్థానికులు తహసీల్దార్ దారా ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మట్టి తోలకాలను అడ్డుకోవాలని వీఆర్ఏలను ఆదేశించడంతో వారు అక్కడకు చేరుకొని తోలకాలను నిలిపివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

ఉత్సాహభరితంగా 'సీఎం కప్' పోటీలు



నేలకొండపల్లి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ కె.జమలారెడ్డి



రఘునాథపాలెం: కోయచలక క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ తదితరులు

నేలకొండపల్లి: మండల స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. రెండో రోజు మండలం నుంచి జిల్లా స్థాయి జట్లకు సంబంధించిన క్రీడాకారులను ఎంపిక చేపట్టారు. మంగళవారం క్రీడలను ఎంపీడీఓ కె.జమలారెడ్డి ప్రారంభించగా.. ఏర్పాట్లను నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ రాయపూడి నవీన్, కార్యదర్శి దేవేందర్‌లు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్స్‌గా కోయచలక జట్లు..

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం పాఠశాలలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో కోయచలకకు చెందిన క్రీడా కారులు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు.బాలికల విభాగంలో వాలీబాల్, ఖోఖో, 100 మీటర్లు, 400 మీటర్ల రన్నింగ్ పోటీల్లో ఫస్ట్ ప్రైజ్, కబడ్డీ, 400 మీటర్ల రన్నింగ్ పోటీల్లో సెకండ్ ప్రైజ్ గెలుచుకోగా, బాలుర విభాగంలో ఖోఖో, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీల్లో సెకండ్ ప్రైజ్ గెలుచుకుని కోయచలక ఓవరాల్ చాంపియన్స్‌గా నిల్చినట్లు పాఠశాల హెచ్ఎం అనితారెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం పోటీల నిర్వహణ ప్రాంతానికి అదనపు కలెక్టర్ స్నేహలతతో పాటు ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ శ్రీనివాస్ హాజరై క్రీడాకారులను అభినందించి సర్టిఫికెట్లు అందించారు.